www.prajasakti.com
ప్రజాశక్తి
5
గురువారం 26 జనవరి 2023
వైఎస్ఆర్

హనుమంత వాహనంపై వేంకటేశ్వరుడు

ప్రజాశక్తి - కడప అర్బన్

తిరుమల తొలిగడప దేవుని కడప శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా పురవీధుల్లో ప్రజలకు దర్శనమిచ్చారు. హనుమంత వాహనంపై ఆసీనులయ్యారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి వచ్చిన కళాకారులు స్వామివారి వాహనాల ముందు కోలాటాలు, చెక్కభజనలు, వివిధ వేషాలలో అలరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు, టిటిడి అధికారులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు కీలకం : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన మన దేశంలో ఓటు హక్కు ఓ వజ్రాయుధమని, తన ఓటు హక్కుతో దేశాన్ని శాసించగల శక్తి ఓటర్లం దరికీ ఉందని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరే ట్‌లోని సభాభవన్‌లో జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో పార్లమెంట్, అసెంబ్లీలకు ప్రజాప్రతినిధులను ఎన్నుకునే ఎంతో విలువైన ఓటరుకు ఓ ప్రత్యేక స్థానం ఉందన్నారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ప్రజాస్వామ్య విలువలను చాటు కుంటూ ప్రపంచ దేశాలకు మన దేశం గీటు రాయిగా నిలిచిందన్నారు. 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును రాజ్యాంగం ప్రసాదించిందన్నారు. కొత్త ఓటర్ల నమోదుపై ఓటు హక్కును అందరికీ కల్పించేందుకు ప్రతి ఏటా ఎన్నికల సంఘం విస్తృతంగా ప్రచారం చేస్తూ ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపడు తోందన్నారు. ఎస్‌పి అన్బురాజన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో ఎక్కడా లేని విధంగా 90 కోట్లకు పైగా ఓటర్లతో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా బారతదేశం అవతరించిందన్నారు. వైవీయూ విసి రంగజనార్దన్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన ఇన్నేళ్ళ తర్వాత కూడా ప్రజాస్వామ్యాన్ని మన నడుపుతున్నామంటే దానికి నిష్పక్షపాతంగా నిర్వహించే ఎన్నికల నిర్వహనే కారణమన్నారు. జిల్లాలోని సీనియర్ ఓటర్లను పూలమాల, శాలువతో సన్మానించారు. ఎక్కువ శాతం నూతన ఓటర్లను నమోదు చేసిన సూపర్వైజర్స్, బిఎల్‌ఒలకు మెమోంటోలను ప్రదానం చేశారు. అంతకుముందు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ముద్ర అకాడమీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో డిఆర్‌ఒ గంగాధర్ గౌడ్, ఆర్‌డిఒ ధర్మ చంద్రారెడ్డి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ రవి కుమార్, తాహశీల్దార్ శివరామిరెడ్డి, డిప్యుటీ తహశీల్దార్ చంద్రమౌళి, సూపరిటెండెంట్ శివారెడ్డి, జిల్లా అధికారులు, సీనియర్ ఓటర్లు పాల్గొన్నారు.

సా..గుతున్న రబీ

- కడప జిల్లాలో 67, అన్నమయ్యలో 47 శాతమే
- లక్ష్యాన్ని చేరని వరి, వేరుశనగ, పత్తి సాగు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రబీ సీజన్ సా..గుతోంది. జిల్లాలోని 36 మండలాల్లో నాలుగో వంతు మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. మిగిలిన 28 మండలాల్లో 25 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కావడం ఊరట కలిగించింది. ఈలెక్కన మిగిలిన మూడు మండలాల్లోనే పూర్తిస్థాయి వర్షపాతం నమోదైనట్లు కనిపిస్తోంది. ఇటువంటి వర్షాభావ పరిస్థితుల్లో వరి, వేరుశనగ, పత్తి పంటల సాగు లక్ష్యాన్ని చేరుకోవడంలో మూడో వంతుకు పరిమితం కావడం ఆందోళన కలిగి స్తోంది. ఈలెక్కన సాగు శాతాన్ని పరిశీలిస్తే కడప జిల్లాలో 67 శాతం, అన్నమయ్య జిల్లాలో 47 శాతం విస్తీర్ణంలో మాత్రమే విత్తనం పడింది. మిగిలిన 53 శాతం సాగు వర్షాభావ పడగ నీడన ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

కడప జిల్లాలో రబీ సీజన్ నత్తనడకన సాగుతోంది. 2022-23 రబీలో 3,77,030 ఎకరాల్లో పంటలు సాగు చేయాలనేది జిల్లా వ్యవ సాయశాఖ లక్ష్యం. నవంబర్ ఒకటి నుంచి జనవరి నెలాఖరు వరకు సాగు చేయాల్సి ఉంది. నవంబర్‌లో 19.4 డిసెంబర్‌లో 268 శాతం లోటు వర్షపాతం నెలకొన్న ఒడిదుడుకుల నేపథ్యంలో మందకొడిగా సాగుతోంది. నవంబర్ నుంచి నేటి వరకు 28 మండలాల్లో ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడంతో 2.53.230 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. మరో 1,23,800 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. ఈలెక్కన సాగు తీరుతెన్నులను పరిశీలిస్తే 67 శాతం విస్తీర్ణంలో పంటలు సాగు కావాల్సి ఉంది. అన్నమయ్య జిల్లాలో సాగు పరి స్థితులను పరిశీలిస్తే ఆందోళన కలిగిస్తోంది. 2022-23 ఆర్థిక సంవత్స రంలో 1,71,822 ఎకరాల సాధా రణ సాగు లక్ష్యానికి గానూ 81,802 ఎకరాల్లోనే విత్తనం పడినట్లు తెలు స్తోంది. ఈలెక్కన 47 శాతం మాత్రమే సాగు చేసినట్లు తెలుస్తోంది. వర్షా భావ పరిస్థితుల నేపథ్యంలోనే మిగిలిన 53 శాతం సాగుకు నోచు కోవడం లేదనే వాదన వినిపిస్తోంది.

బద్వేల్‌లో లోటు వర్షపాతం

బద్వేల్ డివిజన్‌లోని కాశినాయన, పోరుమామిళ్ల, కలసపాడు, మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. సదరు మండలాల్లో లోటు వర్షపాతం నమోదు కావడం రబీ సీజన్‌లో పంటల సాగు మందగించింది. నవంబర్ డిసెంబర్‌లో లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో సాగు లక్ష్యంపై ప్రభావం చూపించింది. రబీ సీజన్‌లో పంటల సాగు దశ నుంచి నేటి వరకు 639.2 మి.మీ వర్షపాతం నమో దు కావాల్సి ఉండగా 632.7 మి.మీ వర్షపాతం నమోదు కావడం గమనార్హం. ఈలెక్కన కడప జిల్లా వ్యాప్తంగా -6.3 శాతం లోటు వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లావ్యాప్తంగా సానుకూల, లోటు వంటి మిశ్రమ వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో రబీ సీజన్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడంపై సందేహాలు వ్యక్తమవుతున్నా యి.

చాపాడు వద్ద సాగులో ఉన్న వరి పంట

తగ్గిన సిరి ధాన్యాల సాగు!

జిల్లాలో సిరిధాన్యాల సాగు తగ్గుముఖం పట్టింది. జిల్లా వ్యాప్తంగా 37,205 ఎకరాల్లో 30 రకాల పంటల్లో సిరిధాన్యాలు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొర్రలు, అరికెలు, సోమలు, వరిగ, ఊదలు వంటి సిరిధాన్యాల 12,674 ఎకరాలకు పరిమితం కావడం ఆందోళన కలిగిస్తోంది. సిరిధాన్యాల సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించక పోవడంతో సాగుకు అవకాశమే లేకుండా పోయినట్ల తెలుస్తోంది. వీటిని మినహాయిస్తే జిల్లాలోని ప్రధాన ఆహార పంటలైన వరి 27,795 ఎకరాలు, బుడ్డశనగ 2,42,035 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 1,77,405 ఎకరాల్లో, జొన్న 24,610 ఎకరాలు, వేరుశనగ 20,630 ఎకరాలు, పత్తి 5004 ఎకరాల్లో మూడో వంతు సాగుకు నోచుకోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇదిలాఉండగా మినుములు 15,925 ఎకరాల్లో సాధారణ సాగు లక్ష్యానికి గానూ 28,338 ఎకరాల్లో రెట్టింపు సాగు కావడం ఊరటను కలిగిస్తోంది.

రబీ లక్ష్యాన్ని అధిగమిస్తాం

రబీ సాగు లక్ష్యాన్ని చేరుకుంటాం. నేటికి 67 శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. మిగిలిన 33 శాతంలో పంటల సాగు కావాల్సి ఉంది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి లక్ష్యాన్ని సునాయాసంగా అధిగమిస్తాం

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి, కడప.

పెద్దదర్గాలో నారా లోకేష్ ప్రత్యేక ప్రార్థనలు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 27వ తేదీన ప్రారంభించనున్న యువగళం పాదయాత్ర సందర్భంగా బుధవారం కడప నగరంలోని పెద్దదర్గా, దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి, చర్చిలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హైదరాబాద్ నుంచి విమానంలో కడపకు వచ్చిన ఆయనకు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి తొలుత తిరుమల తొలిగడప దేవునికడప శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి పెద్దదర్గా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు. పూల చాదర్ సమర్పించారు. దర్గా పీఠాధిపతి ఆరీఫుల్లా హుస్సేని ఆశీస్సులను అందుకున్నారు. అనంతరం మరియాపురంలోని సెయింట్ కేథరిన్ చర్చిలో ప్రార్థనలు చేశారు. ఫాదర్ బి.రాజ ఆశీస్సులు అందుకున్నారు. మతసామరస్యానికి పేరుగాంచిన కడప గడపలో అన్ని మతాలను గౌరవిస్తూ లోకేష్ ప్రార్థనలో పాల్గొన్నారు. లోకేష్ వెంట పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి, నాయకులు హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, ఆర్.రమేష్‌రెడ్డి, భూమా అఖిలప్రియ, డాక్టర్ కృష్ణకిషోర్‌రెడ్డి, రామ్ గోపాల్‌రెడ్డి, అమీర్‌బాబు, నగర అధ్యక్షులు శివకొండారెడ్డి, మహిళా అధ్యక్షులు మురికినాటి సునీత, పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. టిడిపి నగర అధ్యక్షులు సానపురెడ్డి శివకొండారెడ్డి దేవునికడపలో లోకేష్‌ను గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం బొకే అందజేసి పర్యటనలో భాగస్వా ముల య్యారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి, మురికి నాటి అంజి, సాయి పాల్గొన్నారు.

దేవునికడప ఆలయంలో లోకేష్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ఉపాధ్యాయులపై వేధింపులు తగవు : ఫ్యాప్టో

ప్రజాశక్తి - బద్వేలు

విద్యాశాఖాధికారులు ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధించాలని చూస్తే ఉద్యమ బాట పట్టక తప్పదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) జిల్లా చైర్మన్ మాదన విజయ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలను సందర్శించే పేరుతో చిన్న చిన్న కార ణాలను సాకుగా చూపి ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం, షోకాజు నోటీసులు జారీ చేసి వేధిం చడాన్ని వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు విద్యాశాఖా ధికారులు పాఠశాలలను సందర్శించడం, తనిఖీలు చేయడం మంచి పరిణామమేనన్నారు. ఆ పేరుతో చిన్న చిన్న కారణాలను సాకుగా చూపి ఉపాధ్యా యులను వేధించడం తగదన్నారు. విద్యాశాఖ అధికారులు వ్యవహరిస్తున్న తీరు వల్ల ఉపాధ్యా యులు తీవ్ర ఒత్తిడిలకు గురవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు విద్యావ్యవస్థను బలోపేతం చేసేలా వ్యవహరించాలే తప్ప, షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు చేయడం సరికాదన్నారు. అధికారుల పరిశీలనలో ఎక్కడైనా లోపాలు కనిపిస్తే వాటిని ప్రధానోపాధ్యాయులతో, ఉపాధ్యాయులతో చర్చించి, లోపాలను సరి చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. అన్నమయ్య జిల్లా డిఇఒ రాఘవరెడ్డి ఆ జిల్లాలో జిల్లా విద్యాశాఖాధికారి హోదాలో, కడప జిల్లాలో డైట్ ప్రిన్సిపల్ హోదాలో పాఠశాలలను తనిఖీలు చేస్తూ, తనిఖీ చేసిన ప్రతిచోటా ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు జారీ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగా ఉపాధ్యాయులను వేధించడం మానుకొని, క్షేత్రస్థాయిలో ఉండే లోపాలను స్నేహపూరిత వాతావరణంలో సరిచేస్తూ విద్యారంగాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కక్షపూరిత చర్యలను కొనసాగిస్తే ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

పర్యాటక ప్రాంత ఫోటోలను విడుదల చేస్తున్న ప్రతినిధులు

పర్యాటకాభివృద్ధికి ప్రభుత్వ కృషి భేష్

ప్రజాశక్తి కడప అర్బన్

గ్రాండ్ కాన్యాన్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన గండికోటను అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా మార్చేందుకు సిఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి చీఫ్ ప్యాట్రన్ లయన్ మానస కె.చిన్నపరెడ్డి అన్నారు. జాతీయ పర్యాటక దినోత్సవ సందర్భంగా బుధవారం మానస ఇన్‌లో సంస్థ పక్షాన ప్రతినిధులు జిల్లాలోని ముఖ్య పర్యాటక ప్రాంతాల నూతన ఫోటోలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసి రాష్ట్ర దేశ ప్రతిష్టను పెంచేందుకు ఒబెరాయ్ హోటల్స్ గండికోటలో నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవడం పర్యాటక ప్రేమికుల్ని ఉత్సాహపరుస్తోందన్నారు. సభాధ్యక్షులు చరిత్ర అధ్యాపకులు బాలగొండ గంగాధర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కృషితోనే కేంద్ర ప్రభుత్వం స్వదేశీ దర్శన్ పథకం కింద గండికోట ఎంపిక చేసిందన్నారు. రూ.150 కోట్ల నిధులతో ఈ పథకం ద్వారా గండికోట పర్యాటకంగా అంతర్జాతీయ స్థాయి ఆకర్షణగా నిలిచే అవకాశం ఉందన్నారు. జిల్లాకు ఆర్థికంగా కూడా గండికోట ఆయువుపట్టుగా నిలవగలదన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి, ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, వై.జోజిరెడ్డి, వి.గౌరీ శంకర్, దేవతి రవి, ముఖేష్, బి.కొండారెడ్డి, గొబ్బూరి కోటేశ్వర రావు, నాగదాసరి ముని కుమార్ పాల్గొన్నారు.

సిద్దవటం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

సిద్దవటం పోలీస్‌స్టేషన్‌ను ఎస్‌పి అన్బురాజన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు పరిశీలించారు. ఆవరణలో పచ్చదనం పెంపొందించాలని, ఆహ్లాదకరంగా ఉండేలాచర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు త్వరతగతిన పరిష్కరించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబంధించిన కేసులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను త్వరితగతిన వేలం చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, వాహనదారులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. దిశ రిసెప్షన్ సెంటర్‌ను పరిశీలించారు. ఎస్‌ఐ తులసి నాగప్రసాద్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిద్దవటం పోలీసులు పాల్గొన్నారు.

నేడు విద్యార్థులకు సాహిత్య పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్

అరసం జిల్లా మహాసభను పురస్కరించుకుని ఈ నెల 26 సిపి.బ్రౌన్ గ్రంథాలయంలో ఉదయం 10 గంటలకు సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్షులు ఎన్.ఈశ్వరరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి కడప జిల్లాలోని పాఠశాల విద్యార్థులు (పదవ తరగతి వరకు) ఎవరైనా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఐదవ తరగతి వరకు జూనియర్ విభాగం, ఆరు నుంచి పదవ తరగతి వరకు సీనియర్ విభాగాలుగా పోటీలు ఉంటాయని తెలిపారు. రెండు విభాగాల్లో ప్రథమ , ద్వితీయ, తృతీయ బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. కథ చెప్పడం, పద్య పఠనం, వివరణ, కవిత్వ రచన వంటి పోటీలు ఉంటాయన్నారు. పోటీలో గెలుపొందిన విద్యా ర్థులకు ధ్రువపత్రాలతో పాటు ఉపయోగకర పుస్తకాలను ఈ నెల 29న జరగ నున్న జిల్లా మహాసభల్లో బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు.

రైతులకు ఉపయోగపడని ఆర్‌బికెలు

ప్రజాశక్తి-చెన్నూరు

ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ఆర్‌బికెలు రైతులకు ఉపమోగపడటం లేదని టిడిపి రైతు విభాగం రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర లేక అధ్వాన స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. అధిక వ్యయం, కూలీల కొరత ఏర్పడుతుందన్నారు. కొన్ని రోజులుగా రసాయనిక ఎరువుల కొరత ఉందని తెలిపారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయని ప్రభుత్వం ప్రకటన చేస్తున్న క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే రైతుల పరిస్థితి అధ్వానంగా ఉంటే రాష్ట్రం ఎలా ఉంటుందన్నారు. సమావేశంలో మండల టిడిపి అధ్యక్షులు కల్లూరు విజయభాస్కర్‌రెడ్డి, తెలుగు జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ఖాజా హుస్సేన్, బిసి సెల్ అధ్యక్షులు ఆటో బాబు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు

విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరం

ప్రజాశక్తి-కడప అర్బన్

మాట్లాడుతున్న వైభవ్‌గుప్తా

విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంత అవసరమని, క్రీడలతో మా నసికల్లాసం పొందు తారని లెఫ్టినెంట్ కల్నల్ వైభవ్ గుప్తా పేర్కొన్నారు. బుధవారం చిన్న చౌక్‌పాత బైపాస్ దగ్గరలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో క్రీడాజ్యోతి ర్యాలీ చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ దగ్గర ప్రారంభమై ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వరకు నిర్వహించారు. క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల సమావేశానికి లెఫ్టినెంట్ కల్నల్ వైభవ్ గుప్త హాజరై క్రీడా పతాకాన్ని ఎగురవేసి లైట్ ను వెలిగించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. క్రమశిక్షణ శారీరక దారుఢ్యం, మానసిక ధైర్యం,నైతిక విలువలు ఉన్న విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించ గలుగుతారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనేలా చూడవలసిన బాధ్యత ఉందన్నారు విద్యార్థుల ఎదుగుదలకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రభుత్వం ప్రాణాలికలు రూపొందించాలని పేర్కొన్నారు. అనంతరం ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత ఎం. వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలు నర్సరీ నుంచి 12వ తరగతి విద్యార్థుల వరకు నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రికెట్, కబాడీ, ఖోఖో, నూరు మీటర్ల పరుగు పందెం, తేక్వాండో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

యువతకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి - కడప

యువజన సర్వీసుల శాఖ స్టెప్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం-కెరీర్ కౌన్సిలింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పరిశ్రమల కేంద్రం రిటైర్డ్ జిఎం గోపాల్ హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్టెప్ సిఇఒ సాయి గ్రేస్ మాట్లాడుతూ స్టెప్ ఆధ్వర్యంలో యువతకు వ్యక్తిత్వ వికాసంతో పాటు కలలు, క్రీడలు, దిశ యాప్ మొదలగు వాటి గురించి అవగాహన కార్యక్రమాలు వివిధ కళాశాలలో విరివిగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారానే యువత ఎంతో జ్ఞానం పెంపొందిం చుకుంటారని చెప్పారు. ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని ఆకాం క్షించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు విజయలక్ష్మి, దేవి. స్టెప్ మేనేజర్ వివి సుబ్బారాయుడు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రిటైర్డ్ డిఐసి జిఎం గోపాల్

సకాలంలో పాలు అందేలా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్ రామరాజు

కేంద్రాలకు సకాలంలో పాలు అందేలా చూడాలని కలెక్టర్ విజయరామరాజు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏ ప్రాజెక్టుకు అయితే పాలు సకాలంలో అందలేదో ఆ ప్రాజెక్టులకు ముందస్తు ప్రాధాన్యత ఇచ్చి పాలు సరఫరా చేయాలని చెప్పారు. బుధవారం కలెక్టర్ అధ్యక్షతన స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సంబంధించిన సిడిపిఒలు, పాలు, కోడిగుడ్లు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మొత్తం స్టాక్ పాయింట్లకు సంబంధించి వివరాలు అందుబాటులో ఉంచుకొని ఏ ప్రాజెక్టులో పాలు సరఫరా సకాలంలో లేకపోతే ముందస్తు ప్రాధాన్యత ఆ ప్రాజెక్టుకు ఇచ్చి పాలు అందేలా చూడాలని ఆదేశించారు. ప్రతిరోజు కేంద్రాలకు సరఫరా అయ్యే పాలను నిర్దేశిత ఎపిపిల ద్వారా కలెక్టర్ కార్యాలయం నుంచి పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు. ఇందుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అదే క్రమంలో సరఫరా చేసేందుకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. కోడిగుడ్లకు సంబంధించి ముందస్తుగా ఇండెంట్ సేకరించి మొత్తం మూడు విడతలకు గుత్తేదారులకు తెలియజేసి ప్రతి కేంద్రానికి గుడ్లు సరఫరా చేయాలన్నారు. ప్రతి లబ్ధిదారులకు పోషకాహారం అందేలా చర్యలు చేపట్టాలని సిడిపిఒలకు, గుత్తేదారులకు ఆదేశాలు జారీ చేశారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. బుధవారం డిసిసి కార్యాలయంలో జోడో యాత్ర ముగింపు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి వైఫల్యాలు, గతంలో కాంగ్రెస్ దేశానికి ఏం చేసింది, వచ్చే సార్వత్రిక ఎన్నికలలో అధికారంలోకి వస్తే కాంగ్రెస్ ఏమి చేస్తుంది అనే అంశాలను కరపత్రాల రూపంలో ప్రచారం చేయ నున్నామని పేర్కొన్నారు. మోడీ దేశాన్ని అప్పులకుప్ప చేశా న్నారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్, ఎరువులు, నిత్యవసరాలు ధరలు సామాన్యునికి అందుబాటులో లేవన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా చట్టంలోని అంశాలు అమలు చేయకుండా ఆంధ్రప్రదేశ్‌కు మోడీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని తెలిపారు. అప్పుల అవినీతి అరాచక జూద మధ్య డ్రగ్ ఆంధ్రప్రదేశ్‌గా తయారైందన్నారు. వివేకానందరెడ్డి హత్య జరిగి దాదాపు నాలు గేళ్లయిందన్నారు. సిబిఐ దర్యాప్తు ప్రారంభమై మూడేళ్ల వుతోందన్నారు. ఇప్పటికీ అతి గతి లేదని, ఇప్పటికైనా సిబిఐ దర్యాప్తును, విచారణను వేగవంతం చేసి, దోషులను చట్ట పరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షాల సభలకు ర్యాలీలకు పాదయాత్రలకు సవా లక్ష ఆంక్షలు పెట్టడం సమం జసం కాదని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్‌ను ఓటమి ఫోబి యా వెంటాడుతున్నట్లు స్పష్టమవుతున్నదన్నారు. సమా వేశంలో డిసిసి అధ్యక్షులు నీలి శ్రీనివాసరావు, నాయకులు బండి జకరయ్య, సత్తార్, వెంకటరమణారెడ్డి, జయభాస్కర్, తిరుమలేష్, శ్యామలాదేవి, ప్రసాద్ గౌడ్, రామకృష్ణ, శివ, సాదిక్ అలీఖాన్, సూర్యుడు, అమర్, ఉత్తన్న పాల్గొన్నారు.

జోడో యాత్ర ముగింపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

పెళ్లికి నిత్యావసర వస్తువులు వితరణ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

విభిన్న ప్రతిభావంతురాలు మల్లేశ్వరి కూతురు పెళ్లికి టమాటా మర్చంట్ మల్లికార్జున, శ్రీ లక్ష్మి కుబేర స్వర్ణ భైరవ ట్రస్ట్ సహకారంతో విభిన్నప్రతిభావంతుల ఉద్యోగులు, వయోవృద్ధుల కన్వీనర్ అఫ్జల్, గౌరవ అధ్యక్షులు చలపతిరావు ఆధ్వర్యంలో స్థానిక కూరగాయల మార్కెటలో నిత్యవసర సరుకులు, కూరగాయలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైలరింగ్ చేసుకుని జీవనం సాగిస్తున్న, ధీన స్థితిలో ఉన్నా మల్లేశ్వరికి ముగ్గురు కూతుళ్లు. రెండవ కూతురి వివాహానికి బియ్యం ప్యాకెట్, నిత్యవసర సరుకులు, కూరగాయలు పంపిణీ చాలా హర్షణీయమన్నారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు, టమాటా మండి మర్చంట్ మల్లికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

సరుకులు అందజేసిన అఫ్జల్, చలపతిరావు

వికాస్ విహార్‌లో అన్నదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం నల్లబోతుల యూత్ ఆధ్వర్యంలో నల్లబోతుల నాగరాజు రామేశ్వరంలోని వికాస్‌విహార్ విభిన్నప్రతిభావంతులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ వినోద్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు షరీఫ్, తెలుగు యువత కార్యదర్శి పల్ల సాయిరాం, పెన్నానగర్ సుభాన్, మధు, ప్రసాద్, మాబుసున్న, పార్టీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ..

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామం వద్ద గల భగవాన్ కాశీనాయన వృద్ధాశ్రమంలో చిన్నారి మహతి పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు కందుకూరు రఘు వీరశర్మ, నాగర్సి ఆర్థిక సహాయంతో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వాగ్దాడం శివశంకర్, కందుకూరి శివమ్మ, వాగ్దాడం చంద్రశేఖర్, శ్రీ వినాయక ఫౌండేషన్ నిర్వాహకులు దీటి గోపాలకృష్ణయ్య, ఆశ్రమ నిర్వాహకులు వెంకటయ్య పాల్గొన్నారు.

ముక్తియార్ తీరు..దొంగే దొంగ అన్నట్లుంది!

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

టిడిపి నాయకుడు ముక్తియార్ తీరు దొంగే దొంగ..దొంగ అన్నట్లుందని ముస్లిం కౌన్సిలర్లు ఆరోపించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ గతంలో టౌన్ బ్యాంకులో చేసిన దొంగతనం గురించి అందరికీ తెలిసిందేనని అన్నారు. కౌన్సిలర్ ఇర్ఫాన్ మాట్లాడుతూ నిరా ధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. 8వేల మంది రాచమల్లు సైన్యం వైసిపి గెలుపునకు కృషి చేస్తుందన్నారు. టిడిపి హయాంలో కూడా నేరాలు, కుంభకోణాలు జరిగిన సందర్భాలున్నాయని గుర్తు చేశారు. నూతన కూరగాయల మార్కెట్, వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల, రామేశ్వరం బ్రిడ్జి, ఆర్‌టిసి బస్టాండు, నీటి ట్యాంకుల, నీటిపైపుల ఏర్పాటు, కాలువల ఆధునీకరణ, 100 అడుగుల జాతీయ జెండా ఇవి స్థానికంగా గుర్తుండిపోయి ప్రజలకు సౌకర్యం కలిగించే అభివృద్ధి అని వివరించారు. ఎమ్మెల్యే రాచమల్లు దర్గా అభివృద్ధికి రూ.30లక్షలు నగదు ఇవ్వడంతోపాటు మిగిలిన రూ.70లక్షలకు చెక్కులిచ్చి అవసరమైనప్పుడు వినియోగించుకోవాలని సూచించారని తెలిపారు. వడ్ల దాదాపీర్ మాట్లాడుతూ ముక్తియార్ రాజకీయంతో వ్యాపారం చేస్తుంటారని, మసీదు కమిటీలలో అవినీతి జరిగితే అంజుమన్ అధ్యక్షుడిగా ఉండిన సమయంలో ఏమి చేశారన్నారు. పాలగిరి ఖాజా మాట్లాడుతూ మతంతో రాజకీయం చేసే మిమ్మల్ని ముస్లిం నాయకుడని చెప్పుకోవడం తమకు సిగ్గుగా ఉందన్నారు. వక్తలు మాట్లాడుతూ ముస్లింలు ఐక్యంగానే ఉన్నారని, టిడిపి నాయకులు ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హిదాయతుల్లా, కౌన్సిలర్లు వడ్లఖలీల్, కమాల్‌బాషా, గౌస్, పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఇర్ఫాన్

వైఎస్ జయమ్మకు విజయమ్మ నివాళి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి తల్లి వైఎస్ జయమ్మకు మాజీ ఎమ్మెల్యే వైఎస్ విజయమ్మ నివాళులర్పించారు. జయమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె సమాధి వద్ద బుధవారం విజయమ్మ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల సర్పంచుగా జయమ్మ ప్రజలకు సేవ లందించి, అవార్డు పొందారన్నారు. కార్యక్రమంలో వైఎస్ సుధాకర్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, సిఎంఒ జనార్ధన్‌రెడ్డి, కౌన్సిలర్ రమ ణ, డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొ న్నారు.

నివాళులర్పిస్తున్న వైఎస్ విజయమ్మ

8న బియ్యం బహిరంగ వేలం

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండల పరిధిలో పలుచోట్ల అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన పిడిఎస్ బియ్యాన్ని, బియ్యపు పిండిని ఫిబ్రవరి 8న మధ్యాహ్నం బహిరంగంగా వేలం వేస్తున్నట్లు తహాశీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నవంబర్, డిసెంబర్ నెలల్లో మండల వ్యాప్తంగా అక్రమంగా తరలిస్తున్న 7,748 కేజీల పిడిఎస్ బియ్యాన్ని, 1225 కేజీల బియ్యం పిండిని సీజ్ చేశామన్నారు. బియ్యం ప్రభుత్వం నిర్ణయం మేరకు కిలో బియ్యం రూ.37.50 పైసలుగా, బియ్యపు పిండి కిలో రూ.15తక్కువ కాకుండా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు ఈ బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని ఆయన కోరారు.

గుండెపోటుతో ప్రయివేట్ ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని చిన్న గురువలూరు వివేకానంద హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా, ఎల్‌ఐసి ఏజెంట్‌గా పనిచేస్తున్న చెంగా చంద్రఓబుల్‌రెడ్డి (47) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన బంధువులు అందించిన వివరాల ప్రకారం.. చంద్రఓబులరెడ్డికి గుండె నొప్పి రావడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. చంద్రఓబుల్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీస్వామి వివేకానంద హైస్కూల్ కరెస్పాండెంట్ బి.నాగేశ్వరరెడ్డి, ఎపిఎస్ ఆర్‌టిసి మాజీ జోనల్ చైర్మెన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, ఎల్‌ఐసి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, తమప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, ఆయన సతీమణి మాజీ సర్పంచు అరుణాదేవి టిడిపి నేతలు తుమ్మల రామసుబ్బారెడ్డి, తుమ్మల రామాంజనేయులురెడ్డి, తుమ్మల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సి.చంద్రఓబుల్‌రెడ్డి (ఫైల్‌ఫోటో)

బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - కొండాపురం

అక్రమంగా తరలిస్తున్న సర్కార్ బియ్యం, వాహనాన్ని కొండాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పొట్టిపాడు గ్రామానికి చెందిన జగన్నాధం నాగన్న అనే వ్యక్తి ఆటోలో 13బస్తాలు ప్రభుత్వ చౌకధాన్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. బియ్యం వ్యాపారి నాగన్నను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రారంభానికి నోచని పట్టణ ఆరోగ్య కేంద్రం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని ముద్దనూరు రోడ్డు నర్సింగ్ క్వాటర్స్ వద్ద రూ.80లక్షలతో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఈ పట్టణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయి దాదాపు మూడు నెలలు కావస్తున్నప్పటికీ, నగర పంచాయతీ అధికారులు ఆ భవనాన్ని వైద్య ఆరోగ్యశాఖకు ఇంతవరకు అప్పగించలేదని సమాచారం. దీంతో పట్టణ ఆరోగ్య పరిధిలో ఉన్న ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రం పూర్తిగా ఇరుకుగా ఉండడంతో రోగులు, సిబ్బంది అష్టకష్టాలు పడుతున్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి రోగులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వైద్య ఆరోగ్యశాఖకు మొదట ప్రాధాన్యతనిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అధికారులు అందుకు సహకారం అందించడం లేదనే ఆరోపణలున్నాయి. జమ్మలమడుగు నగర పంచాయతీ కేంద్రంలో మరో భవన నిర్మాణం జరగాల్సి ఉంది. కానీ ఇప్పటివరకు జమ్మలమడుగు పట్టణ పరిధిలో స్థలాన్ని సైతం ఇంతవరకు గుర్తించలేదు. పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రాంగణ పరిసరాల్లో పలువురు ఆకతాయిలు వ్యర్థాలతో నింపుతున్నారు. ప్రహరీ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీలైనంత త్వరగా పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

జమ్మలమడుగు పట్టణ ఆరోగ్య కేంద్రం

త్వరలో పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తాం

స్థానిక ముద్దనూరు రోడ్డులో నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభించడానికి చర్యలు చేపట్టాం. త్వరలోనే ప్రజలకు నూతన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని అందుబాటులో ఉంచుతాం.

- కమిషనర్ వెంకట్రామిరెడ్డి.

రోడ్డు విస్తరణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల అభివృద్ధిలో భాగంగా జరుగుతున్న రోడ్డు విస్తరణకు పురపాలక ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ వల్లెపు వరప్రసాద్, వైసిపి పురపాలక ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి కోరారు. స్థానిక పురపాలక కౌన్సిల్ సభ భవనంలో బుధవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పులివెందుల ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేస్తున్నారని, ఇందులో భాగంగా రోడ్డు విస్తరణ చేయాల్సి ఉందన్నారు. 80 అడుగులు వెడల్పుతో విస్తరణ చేస్తున్నారని తెలిపారు. విస్తరణలో భాగంగా ఇల్లు, స్థలాలను కోల్పోయే నిర్వాసితులు డాక్యుమెంట్లను అధికారులకు త్వరగా ఇవ్వాలన్నారు. దీన్ని బట్టి విలువ లెక్కించి పరిహారం ఇస్తారన్నారు. కౌన్సిలర్ కూడా ప్రతిరోజు ఒక గంట తమ వార్డుల్లో పర్యటించాలన్నారు. ఇంటి వద్ద తడి,పొడి చెత్తను వేరు చేయాలన్నారు. దీనిపై కౌన్సిలర్లు తమ సచివాలయం శానిటేషన్ సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లి కిషోర్, కొండలరావు, అరకటవేముల సుజాత, శైలజ, బ్రాహ్మణపల్లి మహేశ్వర్‌రెడ్డి, ఖాదర్‌బాషా, కో-ఆప్షన్ చంద్రమౌళి, రాజశేఖర్, పురపాలక కమిషనర్ వివి నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పేదల సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యం : ఎంపీ

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమమే సిఎం జగన్ లక్ష్యమని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మిట్టపల్లె, కత్తులూరు గ్రామాల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ప్రజలను అడగి తెలుసుకున్నారు. వాటికి పరిష్కార మార్గం చూపారు. కార్యక్రమంలో పులివెందుల ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి, జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, ఎంపిపి లక్ష్మి గాయత్రి, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబులరెడ్డి, మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి, వీరలింగేశ్వరరెడ్డి, పంగా ఉత్తయ్య, ఎంపిడిఒ మల్లికార్జునరెడ్డి, తహాశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రఘునాథ్‌రెడ్డితోపాటు గ్రామ సచివాలయాల సిబ్బంది, మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.


కత్తులూరులో సమస్యలు వింటున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

యువతతోనే సమాజంలో మార్పు

ఓటర్ల అవగాహన ర్యాలీలో రిజిస్టర్ వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు బలమైన ఆయుధమని, ఆ దిశగా ప్రజలను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత యువతపై ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్టర్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. వైవియులో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో 'జాతీయ ఓటర్ల దినోత్సవం' సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ర్యాలీని రిజిస్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి. శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజ గమనాన్ని రుజుమార్గంలో తీసుకెళ్లే ది ఓటు అని అభిప్రాయపడ్డారు. ఓటర్లను చైతన్యం చేయాల్సిన బాధ్యత వాలంటీర్లపై ఉందని గుర్తు చేశారు. జాతీయ సేవా పథకం ద్వారా విద్యార్థుల్లో ప్రేరణ కలిగించినందుకు ఆ విభాగ ప్రతినిధులను అభినందించారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ టి.చంద్రశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వసు గోవర్ధన్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఐక్యు ఎసి సంచాలకులు డాక్టర్ సుబ్రమణ్యం శర్మ, జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ శివప్రతాప్, డాక్టర్ రెడ్డయ్య, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆదినారాయణరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ టి.సురేష్ బాబు, డాక్టర్ మరియదాస్, రిజిస్ట్రార్ పేసి ఖాజా, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** ఓటు హక్కు ఎక్కించడంలో, తొలగించడంలో అధికారులు నిఘా ఉంచాలని ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయ సభా భవనంలో బుధవారం ఆర్‌డిఒ అధ్యక్షతన జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. ఓటు హక్కును ఎక్కించడంలో బిఎల్ఒలు ఎంత ఆసక్తిని చూపుతారో.. తొలగించడంలో కూడా అంతే ఆసక్తిని చూపించాలన్నారు. చనిపోయిన వారి ఓటు ఓటరు జాబితాలో ఉంటే అది సరైన జాబితా కాదన్నారు. వివాహమైన ఆడపిల్ల ఓటు హక్కును తొలగించుకొని, ఆమె ఏ ప్రాంతంలో అయితే నివసిస్తా ఉంటుందో ఆ ప్రాంతంలో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. అత్యధిక సార్లు ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువకులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో తహాశీల్దార్ తిరుపతయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **వేంపల్లె :** ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధం లాంటిదని, 18ఏళ్లు నిండిన వారు తమ ఓటును నమోదు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యోగాంజినేయులు తెలిపారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు మిసైల్ లాంటిదని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇడుపులపాయి ట్రిపుల్ ఐటీలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాము, డాక్టర్ మధుసూదన్, విద్యార్థులు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ సిటిజన్లను ఆర్‌డిఒ వెంకటేశులు, తహాశీల్దార్ మాధవకృష్ణారెడ్డి సన్మానించారు. కొత్తగా వచ్చిన ఓటర్లకు ఓటు కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ ఆయుబ్ ఖాన్, ఆర్ఐ సుజిత్, సిబ్బంది పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** అర్హులైన వారు ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేపించుకోవాలని ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ పి.వి.మోహన్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని కృష్ణ శారద డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు యోగేశ్వర్‌రెడ్డి, సుబ్బారావు, వీర నారాయణ, ప్రసాద్, సూర్య నారాయణ, బాలయ్య, ప్రవీణ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల టౌన్ :** సీనియర్ సిటిజన్ ముత్యాల చిన్న రాయుడును జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్ సన్మానించారు. స్థానిక తన కార్యాలయంలో బుధవారం హ్యూమన్ రైట్స్ కమిషన్ ప్రధాన కార్యదర్శి ముత్యాల ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యులు గంప శ్రీనివాసులు, రంగసముద్రం మాజీ సర్పంచు మాల కొండయ్య, బాలగురయ్య, అయ్యప్ప పాల్గొన్నారు. **కడప :** సీనియర్ ఓటర్లను గౌరవించాలని జాతీయ మానవ హక్కుల న్యాయవాది షేక్ అమీన్‌పీరా, జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తాహిర్ కోరారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన సీనియర్ ఓటర్ కె.ఆశ్రఫ్ అలీఖాన్‌ను వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్.ఆర్ రాయల్ రషీద్ అసోసియేషన్ అధినేత అబ్దుల్ రాయల్ కరీముల్లా, యునైటెడ్ ముస్లిం ఫోరం ప్రధాన కార్యదర్శి రఫీక్ ఖాన్ పాల్గొన్నారు.

అంగన్వాడీల పట్ల మొండి వైఖరిని విడనాడాలి

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

అంగన్వాడీ పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. అంగన్వాడీల ముఖ యాప్‌ను రద్దు చేయాలని కోరుతూ స్థానిక సిఐటియు కార్యాలయ సమీపంలో బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల పట్ల మొండిగా వ్యవహరిస్తూ, వారికి వ్యతిరేకమైన జిఒలు తీసుకొస్తోందన్నారు. ముఖ యాప్‌ను రద్దు చేయాలన్నారు. అంగన్వాడీలకు పనిభారం ఇప్పటికే ఎక్కువైందన్నారు. వారిని దొంగలుగా చూడడం మంచిదికాదన్నారు. ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పు మేరకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సిటు కార్యదర్శి విజయ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బలక్ష్మి, లక్ష్మీదేవి, సాల్మను, సునీత పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సత్యనారాయణ

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ప్రజా సమస్యలను సత్వరమే పరిష్క రించాలని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక 19వ వార్డు నిడివూరులో బుధవారం ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డులోని ప్రతి ఇంటకెళ్లి ఎమ్మెల్యే వారి సమస్యలను తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయో లేదా అని ఆరా తీశారు. ప్రజలు చిన్నపాటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, అక్కడే ఉన్న సంబంధిత అధికారులకు సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. వార్డులోని స్థానిక నాయకులు కొందరు కార్యక్రమ విషయం తెలపకుండా పర్యటించిన ఎమ్మెల్యే తీరుపై ఆయన ముందే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే వారి ఇళ్లకెళ్లి నాయకులను సముదాయించి, మళ్లీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్, ఎస్ఐ కృష్ణయ్య, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కాటన్ ఫ్లెక్సీలు మాత్రమే ఉపయోగించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కాటన్‌తో తయారు చేసిన ఫ్లెక్సీ బ్యానర్లు మాత్రమే ఉపయోగించి పర్యావరణాన్ని పరిరక్షించాలని జమ్మలమడుగు నగర పంచాయతీ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి సూచించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లను గురువారం నుంచి పూర్తిగా నిషేధించిందన్నారు. జమ్మలమడుగు ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్లను తయారు చేయరాదన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై పర్యావరణ చట్టం-1986 ప్రకారం ప్రాసిక్యూషన్ చేస్తారని తెలిపారు. నిషేధించిన ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్‌కు ప్రతి చదరపు అడుగుకు రూ.100 జరిమానా విధిస్తారన్నారు. ఈ విషయాన్ని ప్రజలు, ప్రజా ప్రతినిధులు, ప్లాస్టిక్ ఫ్లెక్సీ బ్యానర్ల తయారు చేయుచున్న యజమానులు గమనించి సహకరించవలసిందిగా కోరారు.


కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి

విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనలో జిల్లా స్థాయికి ఎంపిక

ప్రజాశక్తి - మైదుకూరు

మండలస్థాయి విజ్ఞానశాస్త్ర ప్రదర్శనను బుధవారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించారు. ఇందులో పర్యావరణహిత నమూనాలు, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, యాప్‌లు పర్యావరణ వాతావరణ మార్పులు, గణిత నమూనాలు అంశాలపై పోటీలు నిర్వహించారు. ఇక్కడ విజేతలైనవారు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవుతారని ఎంఇఒ పద్మలత తెలిపారు. జిల్లాస్థాయికి జి.కావ్య, జి.భావన, బి.స్రవంతి, కె.స్నేహలత, బి.అయిషా తబసుమ్, ఎం.నౌసిన్, కె.లక్ష్మినందిని, కె.ప్రసన్నలక్ష్మి ఎంపికయ్యారు. కార్యక్రమంలో పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నమూనాను పరిశీలిస్తున్న ఎంఇఒ పద్మలత

చరిత్ర లేనిదే ఏజాతికి మనుగడలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

చరిత్రలేనిదే ఏజాతికి మనుగడలేదని జిల్లా స్వాతంత్ర్య సమరయోధులు వారి వారసుల సంఘం ప్రధాన కార్యదర్శి టేకూరు సురేష్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం గణతంత్రదినోత్సవం సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గత చరిత్రపైననే భవిష్యత్ నిర్మితమవుతుందన్నారు. స్వాతంత్ర్య సముపార్జనలో కడప జిల్లా వాసులు కడప కోటిరెడ్డి, వై.ఆదినారాయణరెడ్డి, టేకూరు సుబ్బారావు, రాణువ సీతారామయ్య, చవ్వా బాలిరెడ్డి, దేవిరెడ్డి రామసుబ్బారెడ్డి, వేల్పుల సుబ్బయ్య, వల్లపు వెంకటసుబ్బయ్య, పెడబల్లె బాలయల్లారెడ్డి ముఖ్యులని వివరించారు. నేడు దేశం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి స్వాతంత్రోద్యమం నాటి స్ఫూర్తితో అంతా పనిచేయాలన్నారు. దేశభక్తి, దేశాభిమానం సన్నగిల్లి స్వార్థ చింతన పెరుగుతున్న కాలం ఇదన్నారు. దేశప్రజలు సాధించిన ఈ స్వాతంత్ర్య సాధన పోరాటం అపూర్వమైందన్నారు. ఇది ప్రపంచ దేశాలకే ఆదర్శ మన్నారు. ఒక విధంగా ఇది ఆరని జ్యోతి, తరగని నిధి, భావితరాల వారికి సముచిత స్ఫూర్తిని, నూతనోత్తేజాన్ని ఇచ్చే స్థిరమైన శక్తిగా సురేష్‌కుమార్ పేర్కొన్నారు.

క్రీడల్లో రాష్ట్ర స్థాయికి ఎంజెపిఎపి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ హరిత తెలిపారు. బుధవారం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నందలూరులో నిర్వహించిన కబడ్డీ, కోకో, చెస్, షటిల్, రన్నింగ్‌లో తమ విద్యార్థులు చంద్రకళ, శ్రీలత, వర్ష కబడ్డీలో ప్రతిభ చూపగా.. చెస్‌లో సునీత రాణించిందన్నారు. కోకోలో అమృత మేఘన, పార్వతి ప్రతిభ చూపగా.. షటిల్‌లో హర్షిని, రన్నింగ్‌లో గీత రాణించారని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని సింహాచలంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు తమ విద్యార్థులు హాజరవుతున్నట్లు తెలిపారు. గురుకుల పాఠశాల విద్యార్థులు పేదలు కావడంతో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా ఆట వస్తువులు కొనుగోలుకు, విద్యార్థుల రవాణా ఖర్చులుకుగాను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగాల ఉషారాణి రూ.20 వేలు ప్రోత్సాహకం అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఉషారాణికి పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో హరిత

గ్యాస్ సిలిండర్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు

ఎల్‌పి గ్యాస్ సిలిండర్ల వినియోగంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం అవగాహన కార్యక్రమాన్ని ఇండియన్ దిలీప్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు చాపాటి రామసుధాకర్‌రెడ్డి నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు గౌస్‌మొహిద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇంటిలో గ్యాస్ వినియోగించే సందర్భంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. గ్యాస్ లీక్ అయితే వెంటనే వాసన వస్తుందన్నారు. దీన్ని గమనించాలన్నారు. అలాంటి సందర్భంలో వెంటనే రెగ్యులేటర్‌ను నిలిపేసి ఇంటి కిటికీలను తెరవాలన్నారు. విద్యుత్ సరఫరా ఉంటే నిలిపివేయాలన్నారు. కాలం చెల్లిన రెగ్యులేటర్ ఇతర పరికరాలను మార్చాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విసి క్రియేషన్స్ ఆధ్వర్యంలో సినిమా

పులివెందుల రూరల్ : విసి క్రియేషన్స్ నిర్మాణంలో 'పద్మవ్యూహం చక్రధారికే తెలుసు' అను తెలుగు సిని మాను షూటింగ్‌ను సింహాద్రిపురం మండలం కోరగుంటపల్లిలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైసిపి రైతు నాయ కుడు దిన్నెపాడు రవిరాజు క్లాప్ కొట్టి ప్రారంభించారు. హీరో హీరోయిన్లు డాక్టర్ ప్రవీణ్, అనూషీతల్ జోడి తో డైరెక్టర్ సంజయ్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తు న్నారు. ఈ చిత్రంలో నటీనటులు బంగారపు తారాగణం, మహేష్ విట్టా, డిజెటిల్లు మురళి, గౌడ్, భూపాల్‌రాజు, ఆశురెడ్డి, మధునందన్, ధనరాజ్ నటించ నున్నారు.

షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న రవిరాజు

రోడ్డు ప్రమాదంపై అధికారుల విచారణ

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడులో గత శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంపై బుధవారం డిఎస్‌పి వంశీధర్‌గౌడ్, ప్రొద్దుటూరు ఎంవిఐ వేణు ఆధ్వర్యంలో సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెంపో వ్యాను డ్రైవర్ కునుకుపాటు వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోందన్నారు. డ్రైవర్ నిద్ర మత్తులో బ్రేకుకు బదులుగా ఎక్స్‌లేటర్‌ను తొక్కినట్లు అర్థమవుతోందన్నారు. రాత్రి సమయాల్లో వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదంపై సమగ్ర విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో రూరల్ సిఐ నరేంద్రరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వినతి

రాత్రి సమయాల్లో వాహన చోదకులకు ఉపయోగపడేలా సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రోగ్రెసివ్ ఫౌండేషన్ అధ్యక్షులు రామసుధాకర్‌రెడ్డి డిఎస్‌పి, ఎంవిఐలను కోరారు. నేషనల్ హైవే అధికారి విజయ్‌భాస్కర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి జీబ్రా క్రాసింగ్ లైన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారు.